

# కథా కౌముది

# గుర్తింపు

నిర్మలాదిత్య

**శ్రీ హేవళంబ నామ సంవత్సర ఉగాది సందర్భంగా**
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన**
**22 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో**
**ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం**

రిమోట్ నొక్కితేనే, గోడ ఎత్తున్న అందమైన తెరలు మెల్లగా విడిపోయి బయటనున్న ప్రకృతి అందాలను ఇంటి ముంగిలిలో హాజరు పరిచేశాయి. ఆ ఇల్లు మొత్తం గ్లాస్ స్టీల్ తో కట్టడం వల్ల ఇంట్లో ఉన్నామా బయట ఉన్నామా అన్న సంశయాలను తీర్చుకొనే బాధ్యతలు తెరలు తీసుకోలేక తప్ప లేదు. ఎదురుగ ఇసుక రంగులో పేవర్స్ , లేత నీలం రంగులో స్విమ్మింగ్ పూల్ తరువాత ఓ రిబ్బన్ లాగా తెల్లటి ఇసుక సముద్ర తీరం, ఆ తీరం మీద అక్కడక్కడ అందంగా వాలిపోయి గాలి లో సేద తీరుతున్న కొబ్బరి చెట్లు, తెల్లటి నురగలతో అలలు, ఆ పైన నీల వర్ణంలో సముద్రం, పైన అక్కడక్కడ తెల్లగా మెరిసిపోతున్న పిల్ల మేఘాలు, వాటికి నేపథ్యంగా నీలంగా ఉన్న ఆకాశం.... లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అనుకున్నాడుగోపాల్.

శని ఆదివారాలు మార్కో ద్వీపంలో ఉన్న ఇంటికి రావడం గోపాల్ కి ఇష్టం. ఆదివారం "మీట్ ది ప్రెస్" చూస్తూ బిల్స్ అవీ కట్టడం, బ్యాంకు స్టాక్ అకౌంట్స్ చూసుకోవడం గోపాల్ కి అలవాటు అయ్యి పోయింది. సర్ఫేస్ ప్రో ను టాబ్లెట్ గా మార్చి బ్యాంకు ఖాతాలు చూడసాగాడు. పెద్ద తేడాలేమి కనపడలేదు. మియామీ సౌత్ బీచ్ మీదున్న అపార్ట్మెంట్ కి ఇక్కడి మార్కో ద్వీపం ఇంటికి ఈ నెల లోన్ ఇన్స్టాల్మెంట్ జమ అయ్యిపోయింది. వర్కింగ్ డేస్ లో సూర్యోదయం వీకెండ్స్ లో సూర్య అస్తమయం చూడడం అందరికి వీలు కాదేమో. మియామీ మార్కో ద్వీపం ఓ వంద మైళ్ళుండడం తన అదృష్టమే. క్రెడిట్ కార్డు ఖాతాలపై దృష్టి మరల్చాడు. వీలైనంత వరకు అన్ని ఖర్చులు ఒకే కార్డు మీద చేయడానికే ప్రయత్నిస్తాడు గోపాల్. క్రెడిట్ కార్డు స్టేట్మెంటు ను పై పైన చూడసాగాడు. గ్రాసరీ, గాస్, రెస్టారెంట్లు మామూలు ఖర్చులే.

ఉన్నంటుండి ఎదో తేడా కనిపించింది గోపాల్ కు. అంత వరకు పై పైన చూస్తున్న గోపాల్ ఒక్క సారి ఉలిక్కి పడి  మరో సారి చూసాడు. సందేహం లేదు క్రెడిట్ కార్డు కంపెనీ తనకు తన క్రెడిట్ స్కోర్ కూడా ప్రతీ నెలా అప్డేట్ చేస్తుంది. ఈ నెల ఆ స్కోర్ దాదాపు వంద పాయింట్లు పడిపోయింది. ఎక్ససెప్షనల్ క్రెడిట్ స్కోరింగ్ ఉన్నది ఒక రెండు తరగతులు తగ్గి పోయింది. క్రెడిట్ స్కోర్ ఈ దేశంలో ప్రతీ వ్యవహారానికి కావాలి. బ్యాంకులు అప్పు ఇవ్వడానికి సందేహ పడితే వడ్డీ రేట్లు పెంచేస్తారు. ఉద్యోగం ఇవ్వడానికి కూడా ఈ రోజులలో క్రెడిట్ కంపెనీలను స్కోర్ అడిగి తెలుసుకొని ఇస్తున్నారు. అలాంటిది, తనకున్న క్రెడిట్ హిస్టరీ, బ్యాంకు ఖాతాలు తెలిసి కూడా స్కోర్ ఇలా ఎలా పడిపోతుంది. ఎదో పెద్ద పొరపాటు అయ్యే ఉంటుంది. గోపాల్ కి , ఇల్లు చుట్టూ ఉన్న ప్రకృతి , తనకున్న ఇతర ఆస్తులు , మీట్ ది ప్రెస్ ఏమి కనపడలేదు వినపడలేదు. వేంటనే ఫోన్ తీసి క్రెడిట్ కార్డు కంపెనీకి డయల్ చేసాడు.

గోపాల్ డైల్ చేస్తున్న ఫోన్ గుర్తించి వెంటనే కస్టమర్ కేర్ ఆవిడ ఎత్తుకుంది. ఎంతైనా గోపాల్ ప్రీమియర్ కస్టమర్ కదా.

"థాంక్స్ ఫర్ కాలింగ్ , మై నేమ్  ఈజ్ లిండా.  గోపాల్ గారు మీ సోషల్ ఆఖరి నాలుగు సంఖ్యలు, జిప్ కోడ్ చెప్పండి", అంది.

గోపాల్ చెప్పిన సమాధానంతో కాల్ గోపాలనుంచే వచ్చిందని ఋజువు చేసుకొని

"థాంక్స్, చెప్పండి గోపాల్ గారు,  ఈ రోజు మీకోసం ఏమి చేయగలుగుతాను",  అంది లిండా.

"నా క్రెడిట్ స్కోరులో తేడా ఉంది. దాదాపు 100 పాయింట్లు పడిపోయింది", అయోమయంగా ఉన్న గొంతుతో కొంచెం నిష్టూరంగా చెప్పాడు గోపాల్.

" లెట్ మీ చెక్" అని కొంత సేపు తరువాత

" అవునండి మీస్కోర్ పడిపోయింది. ఓ 10 పాయింట్లు అటు ఇటు మారడం మామూలే. 100 పాయింట్లు పడిపోయిందంటే ఎదో లోను మీరు పే చేయడం మరిచి పోయి ఉంటారు. వారు కేడిట్ బ్యూరో కి రిపోర్ట్ చేసి ఉంటారు. దాని వల్లే మీ స్కోర్ పడిపోయి ఉంటుంది. మేము ట్రాన్స్ యూనియన్ నుండి స్కోర్ తీసుకుంటాము. మీరు ఆ కంపెనీకి ఫోన్ చేయండి. లేకపోతే మీరు ఆ కంపెనీ సైటుకు వెళ్లి మీ క్రెడిట్ రిపోర్ట్ తీసుకొని చెక్ చేసికోవచ్చు. "

థాంక్స్ అని చెప్పి – ట్రాన్స్ యూనియన్ నెంబర్ కు ఫోన్ చేసాడు గోపాల్.

ఫోన్ ఎవరు ఎత్తలేదు. వెయిట్ చేయమని సంగీతం మధ్య మధ్యలో రికార్డెడ్ మెసేజ్ వినిపిస్తున్నది. మొదట్లో శ్రావ్యంగా ఉన్న సంగీతం విసుగని పించసాగింది.

గోపాల్ అసహనంతో ఫోన్ పెట్టేసి, టాబిలెట్లో ఆ కంపెనీ వెబ్సైటుకు వెళ్లి తన సోషల్ సెక్యూరిటీ ఇతర వివరాలు ఇచ్చి క్రెడిట్ రిపోర్ట్ చూసాడు.

తాను గతంలో తీసుకున్న అన్ని లోన్లు చక్కగా కట్టివేసినట్లు, ఇప్పుడు తీసుకున్న లోన్లు కూడా కట్టు తున్నట్లు హిస్టరీలో ఉంది. అన్నీ ఆ పెద్ద రిపోర్టులో గోపాల్ ఒక అకౌంట్ వద్ద వచ్చి ఆగిపోయాయి. క్రెడిట్ కార్డు ఓ నాలుగు నెలల క్రితం ఓపెన్ చేయబడింది. ఓ తొమ్మిది వేల అప్పుంది . మూడు నెలలు పే చేయలేదని ఆ క్రెడిట్ కార్డు కంపెనీ రిపోర్ట్ చేయడంతో తన క్రెడిట్ ఒకే సారి 100 పాయింట్లు తగ్గిపోయాయి.

గోపాల్ కి కి మతి పోయినంత పని అయ్యింది. తాను కొత్త క్రెడిట్ కార్డు అకౌంట్ ఓపెన్ చేయడమేమిటి. తన క్రెడిట్ బాగుండాలనే తాను కొత్త కార్డులు ఓపెన్ చేయడం మానేసి చాలా ఏండ్లు అయ్యింది. కార్డు కంపెనీ వివరాలు నోటు చేసుకొని, ఆ కార్డు కంపెనీకి ఫోన్ చేసాడు గోపాల్.

ఓ ఐదు నిమిషాల తరువాత,

"నా పేరు జిల్. ఏమి చేయగలుగుతాను మీ కోసం" అని ఆ కార్డు కంపెనీ ఆవిడ  మాట్లాడింది.

గోపాల్ పొద్దున్న క్రెడిట్ స్కోర్ చూడడం నుంచి ఎలా తన పేరు మీద అకౌంట్ చూడడం జరిగిందో గుక్కతిప్పకుండా ఏకరువు పెట్టాడు.

"మీ సోషల్ సెక్యూరిటీ నెంబర్ చెప్పండి:" అంది జిల్

చెప్పాడు గోపాల్

మీ ఇంటి అడ్రెస్స్ చెప్పండి అంది జిల్

చెప్పాడు గోపాల్

మీ ఫోన్ ఇమెయిల్ అడ్రస్ చెప్పండి అంది.

చెప్పాడు గోపాల్

"అన్నీ సరిపోయాయి అండి . ఒక్క ఈమెయిలు తప్పితే అన్నీ కరెక్టు గానే ఉన్నాయి. మీరు మరో సారి గుర్తు తెచ్చుకోండి. ఓపెన్ చేసి మర్చి పోయాయేమో" అంది జిల్

గోపాల్ కు చిర్రెత్తుకొచ్చింది,"జిల్ నేను ఈ అకౌంట్ ఓపెన్ చేయలేదు. చేస్తే నాకు మీరు స్టేట్మెంట్లు పంపియ్యాలి కదా. నాకింత వరకు ఏమి రాలేదు.. నాకు తొమ్మిది ఏలు ఒక లెక్క కాదు. నేను ఈ అ కౌంట్ ఓపెన్  లేదు – వెంటనే క్రెడిట్ బ్యూరోకి ఫోన్ చేసి నా రికార్డ్ సరి చేయండి. లేకపోతె వాళ్ళు మరో 7 ఏండ్లు నేను పే చేయలేదనే చెప్తుంటారు. పెట్టాడునా క్రెడిట్ హిస్టరీ అనవసరంగా మీరు చేసిన పొరపాటు వలన . నా క్రెడిట్ బాగా దెబ్బ తినింది. ఐ విల్ హోల్డ్ యు రెస్పాన్సిబుల్ " కోపంగా అన్నాడు గోపాల్.

"గోపాల్ గారు నాకు మీ ఫ్రస్ట్రేషన్ అర్థం అయ్యింది. మీకు స్టేట్మెంట్లు రాక పోవడానికి కారణం మాదగ్గరున్న ఇమెయిల్ అడ్రస్ తప్పు ఉండటమే. మీ మాటలు పట్టి చూస్తోంటే మీ ఐడెంటిటీ థెఫ్ట్ అయ్యినట్లు ఉంది. మా ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ కు కనెక్టు చేస్తాను వారితో మాట్లాడం డి" అని జిల్ తప్పుకుంది.

గోపాల్ మరో అరగంట ఫ్రాడ్ డిపార్ట్మెంట్ వాళ్లతో మాట్లాడాడు. వాళ్ళు ఇన్వెస్టిగేట్ చేసి మరో నాలుగైదు వారాలు అయ్యితే కానీ తమ సమాధానం చెప్పలేమన్నారు.

గోపాల్ కి ఒక్కసారి అసహాయత చుట్టుముట్టేసింది. కంట్రోల్ ఫ్రీక్ అని తన కెరీర్ సఫలత మీద ఆడిపోసుకున్న జనం నవ్వుకునేలా ఉంది ప్రస్తుత పరిస్థితి అనుకున్నాడు గోపాల్.

ఈ మూడు వారాలు చేతులు కట్టుకొని ఉండాలనిపించలేదు గోపాల్ కి  అంత వరకు అందంగా ఉన్న ప్రకృతి విసుగ్గా అనిపించింది. బయట కాంతి ఎక్కువైనట్లనిపించి, రిమోట్ నొక్కి  కర్టెన్స్ మూసేసాడు గోపాల్.

కొంచెం చీకటి గా ఉన్న ఆ గది ఆలోచించడానికి బాగుందని పించింది గోపాల్ కి. ఎలా నా సోషల్, అడ్రస్ , ఫోన్ నెంబర్ అన్ని వివరాలు ఎవరికో తెలిసిపోయాయి. నా గుర్తింపు పబ్లిక్ కి తెలిసిపోయి మంట కలిసిపోయినట్లుంది. గోపాల్ కి మరింత బాధ కలిగించిన విషయం తను సెక్యూరిటీ ఎక్స్పర్ట్ గానే ఈ దేశంలో అడుగు పెట్టి మొదటి ఉద్యోగం సంపాదించగలగడం. అలాంటి తనే ఐడెంటిటీ దొంగల వల్ల దగా పడడం . తానే ఈ సమస్యను ఒకటి రెండు వారాలలో  పరిష్కరించాలి.

ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టలేడనడం గుర్తుకొచ్చింది. తాను చదివిన రీసెర్చ్ కూడా అదే చెప్తుంది, తన సోషల్ సెక్యూరిటీ నంబర్ తెలిసిన వారి సంఖ్య కూడా ఒక చేతి వేళ్ళలో లెక్క పెట్టొచ్చు.

ఎదురుగా ఉన్న గోడ మీద మధ్యలో కొట్టేట్టు పెట్టిన ఫ్రేమ్ కనిపించింది. మాధవి M.D డిగ్రీ సర్టిఫికెట్.

మాధవి  పుట్టినప్పుడు, మొదటి సారి  సరిగా ఎత్తుకుంటున్నానో లేదో అన్న కొంత భయంతో , అనిర్వచనీయనమయిన 'నా పాప' అన్న భావంతో ఒక్కింత గర్వం తో ఎత్తుకున్నప్పుడే ఎప్పటికి తెగని బంధం అని అనుకున్నాడు గోపాల్. కాకి పిల్ల కాకికి ముద్దైన, మాధవి తన పెద్ద పెద్ద కళ్ళతో ఎప్పుడూ నవ్వుతూ ఉండే ముఖంతో అందరి దృష్టి ఆకర్షించడం తాను ఓ అందగత్తె అన్న భావం గోపాల్ కి ధ్రువ పడిపోయింది. అందం తో పాటు మాధవి తెలివైనది కూడా. ఆ తెలివి మాధవి అమ్మ సైడు నుంచే వచ్చి ఉండాలి. ప్రతీ విషయం పోటీగా తీసుకొని నెగ్గడం మాత్రం తాను పని కట్టుకొని మరీ నేర్పించాడు. మరి ఈ ప్రపంచంలో తట్టుకోవాలంటే ఆ మాత్రం మెళుకువలు తెల్సి ఉండాల్సిందే కదా.  లెగో, డ్రాయింగ్, డిబేట్, లీడర్షిప్, టెన్నిస్, బాస్కెట్ బాల్ ఒకటేమిటి, ప్రతీ దానికి కోచింగ్ ఇచ్చి మరీ గెలిపించాడు గోపాల్.

పని తొందరలో వీకెండ్స్ మాత్రమే తనతో గడప గలిగినా , ఉన్నంత సేపు తాను పైకి పోవాలని, అన్నిటిలో ఫస్ట్ రావాలని తెగ ప్రయత్నించాడు. మాధవి కూడా వీకెండ్స్ లో గోపాల్ ని అంటి పెట్టుకొనే ఉండేది, 'నాన్న నాన్న' అంటూ.

హైస్కూల్ వస్తూనే మాధవిలో మార్పు వచ్చేసింది. వీకెండ్స్ తనతో గడపడానికి ఇష్టపడేది కాదు. చదువు తప్పితే మిగతా ఆక్టివిటీస్ బాగా తగ్గించేసింది. తనతో ఇంతకూ మునుపటిలా మాట్లాడమూ మానేసింది. గోపాల్ తండ్రి గా తన బాధ్యత మరువ తలచుకోలేదు. తన మాధవి ఈ ప్రపంచంలో తన లాగే ఓ గొప్ప పోటీదారునిలాగే మరల్చాలనుకున్నాడు.

కాలేజీకి తను ప్రీ మెడికల్ తీసుకోమంటే వద్దంది. తానే బలవంతంగా, తన భవిషత్తు బాగుంటుందని చేర్పించాడు. తానే ఁంఛాట్ రాయించాడు. దగ్గరుండి మెడికల్ కాలేజీలకంతా అప్లై చేయించాడు. మాధవి కాలేజీలో ఉన్నప్పుడే సంబంధాలని వెదకడం మొదలెట్టాడు. తన పరిచయస్తులలో ఉన్న అనిల్ మిశ్ర అబ్బాయి కూడ దెర్మటాలజీ రెసిడెన్సీ చేస్తున్నాడని కనుక్కొని వాళ్లతో మాట్లాడి మాధవి ఫోటో చూపెట్టాడు. అందం తో పాటు గోపాల్ ఆస్తి అంతస్తు చూసిన మిశ్ర వెంటనే ఒప్పుకోవడం జరిగింది. మాధవి గ్రాద్యుయేషన్ అయ్యిన వెంటనే మిశ్ర వాళ్లబ్బాయి తో పరిచయం చేద్దాం అనుకున్నాడు గోపాల్.

మాధవి మెడికల్ కాలేజీ తరువాత ఒక సంవత్సరం బ్రేక్ తీసుకుంటానంది . తన ఊశంళే స్కోర్లు చూసిన గోపాల్ అప్పుడే తనని కాబోయే అల్లుడితో పాటు డెర్మటాలజీ లోనో ప్లాస్టిక్ లేక న్యూరో సర్జరీలోనో మాధవిని అప్లై చేయిద్దామనుకున్నాడు. మాదవి కి ఆ రెసిడెన్సీ మ్యాచ్ లో సులభంగా వస్తుందనే గోపాల్ నమ్మకం. అందుకే మాదవి అడిగిన వెంటనే తన రెసిడెన్సీ ఓ సంవత్సరం తరువాత చేయడానికి ఒప్పుకున్నాడు.

గ్రాద్యుయేషన్ రోజు రానే వచ్చింది. తరువాతి వీకెండ్ లాస్ వేగాస్ పోయి మిశ్ర వాళ్ళ కుటుంబం వారి అబ్బాయితో మాధవిని పరిచయం చేయాలని గోపాల్ ఆలోచన.

కామెన్సమెంట్ ఆనందంగా గడిచింది. మాధవి మె డలో స్కార్ఫ్ వేసి సర్టిఫికెట్ అందచేస్తున్న క్షణం తాను మాధవిఇలా ఎదగ డానికి పడిన కష్టం అంతా గుర్తుకు వచ్చి కంట్లో నీళ్లు తిరిగాయి గోపాల్ కి.

ఫంక్షన్ తరువాత మార్కో ద్వీపంలో ఉన్న ఇదే ఇంటికి తీసుకెళ్ల మంది మాధవి.

గోపాల్ కి కూడా తన సెలబ్రేషన్ తన ఇంట్లో చేయడం సంతోషం అనిపించింది. మరుసటి రోజు తాను లేచే సరికి మాధవినే లేచి బ్రేఅక్ఫస్ట్ చేసింది. ఇదే స్విమ్మింగ్ పూల్ ప్రక్క డెక్ కుర్చీలలో కూర్చుని బ్రేక్ఫాస్ట్ కని చేసిన ఆమ్లెట్ టోస్ట్ తింటూ కాఫీ తాగుతూ మాధవితో మిశ్ర వాళ్లబ్బాయి ప్రసక్తి తెచ్చాడు.

" అబ్బే ఇప్పుడే పెళ్లి చేసుకోదలచు కోలేదు నాన్న", అంది మాధవి.

"ఇప్పుడే పెళ్లి వద్దు లెమ్మా . పరిచయం చేసుకో. ఈ వీకెండ్ లాస్ వేగాస్ కి టికెట్ బుక్ చేసా . అక్కడ మిశ్రా వాళ్ళు కూడా వస్తున్నారు. మాట్లాడు. నచ్చితే ప్రొసీడ్ కండి ", అన్నాడు గోపాల్.

ఓ 2 నిమిషాలు మాధవి ఏమి మాట్లాడలేదు.

ఎదో చెప్పాలని ప్రయత్ని స్తున్నదని తెలుస్తూనే ఉంది గోపాల్ కి.

" నాన్న ముందే చెప్పాలనుకున్నాను. కానీ మీరు నాకవకాశం ఇవ్వ లేదు. నాకు ఇప్పటికే బాయ్ ఫ్రెండ్ ఉన్నాడు. చాలా మటుకు అతనినే పెళ్లి చేసుకుంటా నేమో"

గోపాల్ కి పెద్ద షాక్ లాగ అనిపించింది.

చిన్నపిల్ల లాగానే చూసాడు ఇన్ని రోజులు. అన్నీ తానే అమర్చి ఉంచాడు. అలాంటిది తానే తన భర్తను వెదుక్కునే స్థాయికి వచ్చిందంటే నమ్మలేక పోయాడు.  షాక్ నుండి తేరుకొని

సంతోషంగానే "ఎవరమ్మా అతను నీ క్లాస్ మేటేనా " అతృతతో అడిగాడు.

"కాదు  నాన్న, ఆత ను కొరియన్ . హోటల్లో చెఫ్ గా పని చేస్తాడు".

పోయిన షాక్ మరో సారి కొట్టింది గోపాల్ కి

కోపంతో తాను మాధవి కోసం ఎన్ని త్యాగాలు చేసాడో చెప్పి ఆ చెఫ్ మరిచిపోయి మిశ్రాను కలవమన్నాడు.

గోపాల్ కొపం తో మాట్లాడినంత సేపు నోరు మెదలపలేదు మాధవి.

గోపాల్ కంతశోష తో మాట్లాడడం ఆపిన తరువాత మాధవి

"నాన్న మీరు కావాల్సిన విధంగా నా జీవితం మరల్చాలని చూసారు. ఇంకా ప్రయత్నిస్తున్నారు. అది మీ విజయాపజయాలతో ముడి పెట్టుకున్నారు. కానీ నా యుద్ధాలు నేను చేయాలి. నా గెలుపు ఓటమిలు నేను చవిచూడాలి. వచ్చే సంవత్సరం నేను టీచర్ ట్రైనింగ్ కు వెళ్ళు తున్నాను. నాకు డాక్టర్ అయ్యి బోలెడంత డబ్బు సంపాదించాలన్న ఆశ లేదు. నన్ను మెడిసిన్ చదవమన్నపుడు ఎప్పుడు కూడా వచ్చే డబ్బు హోదా గురించే మాట్లాడి ప్రోత్సహించేవా తప్పితే ఏదో సేవ చేయవచ్చు అని చెప్ప;లేదు. నాకు చిన్న పిల్లల్తో గడపడం వాళ్లకి చదువు చెప్పడం ఇష్టం . నేనో ఎలిమెంటరీ టీచర్ అవ్వుదామని అనుకుంటున్నాను. " అంది మాధవి.

మరి ఇంత చదువు ఏమి చేస్తావమ్మా, ఈ సర్టిఫికెట్ ఎందుకు' వాపోయాడు గోపాల్

"ఈ చదువు సర్టిఫికెట్ మీకోసమే. ఇది నా గిఫ్ట్ గా అనుకోండి", అంటూ ఆ సర్టిఫికెట్ ఉన్న ఫ్రేమ్ ను ఎదురు గా ఉన్న గోడ మీద కొట్టొచ్చేటట్టు కన్పడేటట్టు తగిలించి వెళ్లి పోయింది.

గోపాల్ మాధవిని తెగ తిట్టి పోసాడు. అంత జరిగిన ఆ సర్టిఫికెట్ తీయలేక పోయాడు. ఇంటికి వచ్చినఆ ఫ్రెండ్స్ కు ఆ సర్టి ఫికెట్ చూపెట్టి గర్వంతో మాధవి నా కూతురు అని పరిచయం చేసుకుంటాడు.

మాధవి మళ్ళీ కలవాలని ప్రయత్నించలేదు. మెడికల్ కెరీర్ వద్దనుకున్నా పిల్ల ఈ ఐడెంటిటీ ఫ్రాడ్ ఎందుకు చేస్తుంది.

ఆలోచనలు ఆరతి వైపు మళ్ళాయి.

ఆరతి గోపాల్ క్లాస్మేట్. తను బాగా చదివేది కూడా. గోపాల్ అల్లరిగా , చదువు తేలికగా తీసుకొని తిరుగుతుండడం వల్ల – ఆరతి గోపాల్ ని పెద్దగా పట్టించుకునేది కాదు. కానీ గోపాల్ కి ఆరతి అంటే ఏదో ఆకర్షణ . వెంటబడి మరీ ఆరతిని తన మాటల గారడీ తో ప్రేమలో పడేసాడు. ఇద్దరూ సివిల్ ఇంజినీరింగ్ కాగానే పెళ్లి చేసుకొని, ఉద్యోగ ప్రయత్నాలలో పడ్డారు. ఆరతి సర్వీస్ కమీషన్ పరీక్ష వ్రాయడం ప్రభుత్వ . ఉద్యోగం రావడం లో పెద్ద సమయం పట్టలేదు. గోపాల్ కి ఉద్యోగం రావడం కొంచెం కష్టమే అయ్యింది. చివరకు ఓ చిన్న కాంట్రాక్టుకంపెనీ లో చేరి ఆఫీస్ బిల్డింగ్లు అవీ కట్టడం పని లో చేరాడు. మాధవి పుట్టడంతో గోపాల్ కి వారి కుటుంబానికి ఒక అర్ధం వచ్చిందనిపించింది.

ఇద్దరి సంపాదనలతో , ఒక ఫ్లాట్ కొనడం, ఇంటికి కావలసిన వస్తువులన్నీ కొనుక్కో గలగడం మాధవిని ఓ మంచి స్కూల్ లో చేర్పించడం, ఓ చిన్న కారు కూడా జత కావడం, సంసారం ఓ కల లా యిట్టె గడిచిపోతున్నదేమి అని ఆరతి అప్పుడప్పుడు అనుకోవడంలో తప్పులేదు. మనం ప్రేమించే వారితో కన్నా, మనల్ని ప్రేమించే వారిని పెళ్లి చేసుకోవడంలో సుఖం ఉందనటంలో నిజం ఉందనిపించేది ఆరతికి .

గోపాల్ కి ఆంబిషన్ ఏక్కువే. పైకి చూపక పోయినా ఓ చిన్న కంపెనీలో పని చేస్తుండడం కష్టం గానే ఉంది. కోట్లు సంపాదించాలి, ఎక్కడో వెళ్లి పోవాలి అని గోపాల్ కలలు . ఆరతి కి తన కంటే మంచి ఉద్యోగం ఉండటం కూడా పైకి చెప్పక పోయినా నామోషిగానే ఉంది గోపాల్ కు. అలాంటి పరిస్థితులలో తెలిసిన వాళ్లలో కొందరు అమెరికా పోవడం , అతి కొంత వ్యవధిలో నే ఊహించనంత డబ్బులు చేసుకోవడం గురించి విన్నాడు. చేస్తున్న ఉద్యోగం మానేసి ఓ కంప్యూటర్ కంపెనీ లో సేల్స్ మేనేజర్ గా చేరాడు. ఆరతికి గోపాల్ అలా సంబంధం లేని ఉద్యోగం చేరడం ఇష్టం లేక పోయిన, గోపాల్ కి ఇష్టం అని ఊరుకుంది. అదే తాను చేసిన పెద్ద పొరపాటు. అలా సేల్స్ పని మీద తిరుగుతూ, అమెరికాకు జనాలను అతి సులువుగా పంపించగలుగుతున్న ఓ చిన్న కంపెనీ ఓనర్ తో మంచి స్నేహం ఏర్పడింది గోపాల్ కి. ఆ కంపెనీ కి ట్రైనింగ్ కని డెస్క్ టాప్ కంప్యూటర్లు అమ్మాడు గోపాల్.

అమెరికా పోతానంటే సహాయం చేస్తాననడం తో గోపాల్ కి స్వర్గ ద్వారాలు తెరుచుకున్నాయని పించింది. అక్కడే ఒకటి రెండు బేసిక్ కోర్సులు చేసి సర్టిఫికెట్ లు సంపాదించేసాడు. గోపాల్ వల్ల కంప్యూటర్ల మీద మంచి డీల్ దొరకడంతో ఆ కంపెనీ అతను తనకు తెలిసిన మార్గంలో గోపాల్ ఓ గొప్ప సాఫ్ట్ వేర్ నిపుణుడ ని H1B వీసా సంపాందించేసాడు గోపాల్ కి.

అంత వరకు ఆరతితో తన ప్రయత్నాల గురించి మాట్లాడని గోపాల్ , మంచి ఉద్యోగావకాశాలున్నాయి అమెరికా వెళ్లి పోదామన్నాడు. ఆరతికి గోపాల్ చెప్పింది ఏమాత్రం నచ్చలేదు.

అన్నీ మన దగ్గరున్నాయి కదండీ. సరిపడా డబ్బు ఉంది. పిల్ల చదువుకోవడానికి మంచి స్కూల్ కూడా ఉంది. మా అమ్మా నాన్న అత్తయ్య మామయ్యా కావలసిన వారందరూ ఇక్కడే ఉన్నారు. మనకేమి తక్కువైనదని మళ్ళీ మొదటినుంచి మన జీవితం మొదలెట్టాలి. గోపాల్ పట్టిన పట్టు విడ లేదు. ఆరతి పోగూడదని ఏడ్చింది కూడా. చివరకు గోపాల్ గెలిచాడు. అమెరికా రావడం, కొంచెం కష్ట పడిన తరువాత ఉద్యోగంలో చేరడం, ఆరతిని మాధవిని తెప్పించుకోవడం అన్నీ జరిగిపోయాయి. మంచి ఉద్యోగం వదిలి పెట్టానని ఆరతి మొదట్లో కష్ట పడినా, గోపాల్ సంతోషం చూసి సర్దుకు పోయింది. మాధవి స్కూల్ కొత్త ఆక్టివిటీస్, కొత్త స్నేహితులతో కాలం మొదట్లో పరిగెడు తున్నట్లే అనిపించింది.

గోపాల్ కున్న కోర్కెలకు అంతులేదు అన్న విషయం ఆరతికి తొందరలోనే తెలిసిపోయింది. ఈ దేశం వచ్చాక మరీ అవధులు లేవనిపించింది. పని పని అంటూ ఇంట్లో ఉన్నప్పుడు కూడా చికాకుగా ఉండటం, పని మీద సోమవారం నుంచి గురు వారం వరకు ఊళ్లు

తిరుగుతుండడం జీవితంలో పూర్తి మార్పులొచ్చేశాయి అనిపించింది ఆరతి కి. ఎందుకు ట్రావెల్ జాబ్స్ అండి కనీసం ఇంటి పట్టునుండి పని చేసుకోండి . మాధవి కూడా కొన్ని సంవత్సరాలలో కాలేజీ కి వెళ్లి పోతుంది. మీరు ఈ టైం మిస్ అవ్వుతారు అని అప్పుడప్పుడు చెప్తూనే ఉండేది. గోపాల్ కి ఈ మాటలు నచ్చేవి కాదు.

మాధవిని ఒంటరిగా స్కూల్ ఆక్టివిటీస్ అన్నిటికీ తీసుకు పోవడం ఆరతికి రాగ రాగ కష్టమనించడమే కాక గోపాల్ మీద కోపం తెప్పించడం మొదలెట్టాయి. మాధవి పాల్గొన్న డ్రామా, డాన్స్ లు , మాధవి ని పిలిచి ఇచ్చిన ప్రైజ్ లు స్కాలర్షిప్ లు కూడా గోపాల్ చూడ లేక పోవడం ఆరతి, మాధవి ఇద్దరికీ నచ్చలేదు. గోపాల్ తీపి మాటలు , రాక పోవడానికి సాకులు చేదుగా పేలవంగా అనిపించసాగాయి. మాధవి లేనప్పుడు ఆరతి గోపాల్ గొడవ పడడం కూడా జరిగింది. మొదట్లో చిన్న గా అనిపించినా మాధవి కాలేజీ వెళ్లే సరికి ఆ గొడవలు పెద్ద కొట్లాటలగానే మారాయి. గోపాల్ తనకున్న బ్యాంక్ బాలన్స్, కొన్న ఇండ్లు చూపెట్టి ఆరతిని అనూనాయించాలని ప్రయతించడం కూడా వీలు కాలేదు. గోపాల్ కూడా వీకెండ్స్ లో అప్పుడప్పుడు ఇంటికి రావడం మానేసాడు. గోపాల్ వచ్చినా ఆరతి పెద్దగా మాట్లాదేది కాదు.

ఓ సారి ఇంటికి వస్తే గోపాల్ ఇంటి తాళం తెరవలేక పోయాడు. ఆరతికి ఫోన్ చేస్తే తానే తాళం మార్చేశానని, తనకు విడాకులు కావాలని చెప్పింది. బాగా షాక్ అయ్యాడు గోపాల్. తమ మనస్పర్థలు ఇంతకు దారి తీస్తాయని అనుకోలేదు. కెరీర్ పీక్ లో ఉన్నాడు తను తాను చేస్తున్న వ్యాపారం బూమ్ లో ఉంది. ఏ మాత్రం సంకోచం లేక విడాకులు ఇచ్చేసాడు గోపాల్.

ఆరతి విడాకులు తరువాత తన సివిల్ డిగ్రీ ఉపయోగించి, ఇక్కడి సర్టిఫికేషన్లు పాస్ అయ్యి టౌన్ ప్లానర్ గా చేరిందని విన్నాడు. గత రెండు సంవత్సరాలు బాబ్ తో కలిసి ఒకే ఇంట్లో ఉన్నారని తెలుసు. మొదటి సారి ఆవార్త విన్నప్పుడు బాబ్ ఎవరని ఇన్ డైరెక్టు గా అడిగాడు ఆరతిని గోపాల్ ఫోన్లో . ఆ విషయాలన్నీ నీ కనవసరం .మాధవిని గురించి ఏమన్నా విశేషాలు ఉంటె చెప్పు మాట్లాడు తానూ అని కచ్చితంగా చెప్పింది ఆరతి .

ఆ తరువాత మాట్లాడడం బాగా తగ్గిపోయింది. మాధవి కూడా ఆరతి విషయాలు తన దగ్గర చెప్పేది కాదు. కానీ తన వద్ద కంటే ఆరతి బాబ్ ల దగ్గరే మాధవి సంతోషంగా ఉంటున్న దేమో అని గోపాల్ సందేహం ఎవరికీ చెప్పుకోలేని బాధ.

ఫోన్ తీసి ఆరతికి కి దయల్ చేసాడు గోపాల్.

" హలో గోపాల్ ఎలా ఉన్నావు. చాలా రోజులకు సర్పైస్ . ఏంటి విశేషాలు ", మామూలుగానే మాట్లాడింది ఆరతి

మాధవికి గోపాల్ కి పెద్దగా మాటలు ఈ మధ్య లేవని తెలుసు ఆరతికి ఆవిషయం పైనే మాధవి గురించి తెలుసుకోవాలని చేసాడనుకుంది ఆరతి .

" ఓ చిన్న ప్రశ్ననే అట్టే సమయం తీసుకోను. నీవు ఈ మధ్యం ఏమైనా క్రెడిట్ కార్డు ఓపెన్ చేశావా"

" లేదు ఎందుకని" ఆశ్చర్యంగా అడిగింది ఆరతి.

" ఎవరో నా సోషల్ ఉపయోగించి కార్డు తీసుకున్నారు. నా క్రెడిట్ రేటింగ్ పడిపోయింది', అన్నాడు గోపాల్.

" నీ వేమి మార లేదు గోపాల్ ", ఒక్కింత ఎగతాళి మేళవించిన నవ్వుతో మాధవి ఫోన్ పెట్టేసింది. తన మనస్సులో గోపాల్ రేటింగ్ మరో వంద పాయింట్లు తగ్గిపోయాయి అని ఫోన్ పెట్టేసిన తరువాత నవ్వుకుంది ఆరతి.

మాధవి, ఆరతి పోతే ఇక మిగిలింది రమేష్. రమేష్ కూడా గోపాల్ క్లాస్మేట్ స్నేహితుడే. బాగా చదివేవాడు కూడా. ఆరతి రమేష్ ప్రతీ పరీక్షలలో పోటీ పడేవారు. ఒక సారి ఆరతి కి ఫస్ట్ వస్తే, మరో సారి రమేష్ కి వచ్చేది. రమేష్ ఆరతి ల జోడి కూడా బాగుందేమో. ఇద్దరూ చూడడానికి బాగానే ఉంటారు. కానీ రమేష్ వాళ్ళమ్మ నాన్నలు చూసిన సంబంధం చేసుకున్నాడు. పెళ్లి కూతురు మీనా ఎకనామిక్స్ లో బి ఏ చేసింది. పెళ్ళైన కొత్తలో రెండు జంటలు హైదరాబాద్ లో దగ్గర దగ్గర ఇండ్లలోనే ఉండటం వల్ల బాగా కలిసే వారు, మీనా కూడా మంచి కలుపుగోలు మనిషి. రమేష్ పెళ్ళైన ఏడాది కంత పి హెచ్ డి అనీ అమెరికా లో యూనివర్సిటీ కి వెళ్లడం అటు తరువాత అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్ గా జాయిన్ అవ్వడం మీనాతో సహా అమెరికా లో స్థిర పడడం జరిగింది. గోపాల్ కి ఓ 10 ఏళ్ల తరువాత ఐ టి రంగంలో అవకాశం వస్తే రమేష్ వాళింట్లోనే మకాం. మాదవి చిన్న పిల్ల, ఆరతి గోపాల్ ఓ మూడు నెలలు వాళింట్లోనే ఉన్నారు. అప్పుడే గోపాల్ సోషల్ కు అప్లై చేయ దానికి రమేష్ సోషల్ సెక్యూరిటీ ఆఫీస్ కు తీసుకోవడం జరిగింది. గోపాల్ సోషల్ సెక్యూరిటీ నెంబర్ రమేష్ కు తెలుసు.

ఉద్యోగం రావడాని కి ఐదు నెలలు పట్టడానికి కారణం ఉంది. గోపాల్ చదివింది సివిల్ఇంజనీరింగ్. ఐ టీ రంగంలో ఉద్యోగ ప్రయత్నం. గోపాల్ కి ఇంటర్వ్యూ లో అన్నీ పరాజయాలు. ఇక లాభం లేదని గోపాల్ ను అమెరికాకు తెప్పించిన కంపెనీ వాడు గోపాల బదులు మరో తెలివిగల ఐ టీ ఇంజనీర్ చేత జవాబులు ఫోన్ ఇంటర్వ్యూ లో చెప్పించేసి ఓ ఉద్యోగస్తుడుని చేసేసాడు. గోపాల్ కి సబ్జెక్టు తెలియకపోయిన, మాటల గారడీ తో ఎదుటి వారిని బుట్టలో వేసుకోవడం బాగా వచ్చు . టెర్రిఫిక్ కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్ అంటూ అంచెలంచెలుగా కార్పొరేట్ నిచ్చెనలు సునాయాసంగా ఎక్కేసి పేరు పరపతి సంపాదించేసుకున్నాడు. దానితో రమేష్ లాంటి వారితో మాట్లాడడానికి అంతగా సమయం వెచ్చింప లేక పోయాడు.ఆరతి మాత్రం రమేష్ , మీనాలతో ఎప్పటిలాగే మాట్లాడుతూ ఉండేది. ఆరతి వల్ల తమ కుటుంబ విషయాలు అన్నీ రమేష్ మీనాలకు తెలుసు . అలానే ఆరతి చెబితే రమేష్ కుటుంబ విషయాలు గోపాల్ కు తెలిసేవి. మాధవిని వదిలేసిన తరువాత ఇదే తాను రమేష్ తో మళ్ళీ మాట్లాడనుకోవడం.

రమేష్ నెంబర్ మాధవి వదిలిపోతున్నప్పుడు ఇచ్చిన కాంటాక్ట్ లిస్టులో ఉన్నది. ఆ లిస్ట్ వెదికి రమేష్ కు డయల్ చేసాడు గోపాల్.

"రమేష్ స్పీకింగ్ , హూ ఈజ్ దిస్ ?", చాలా రోజుల తరువాత రమేష్ గొంతు వినపడింది

" నేను గోపాల్ ని మాట్లాడుతున్నాను. ఫ్రీ నే కదా . మాట్లాడ వచ్చా ?", ఇక్కడి సాంప్రదాయాలనుసరించి గోపాల్ ప్రశ్నించాడు.

"గోపాల్, ఎన్ని రోజుల తరువాత, బాగున్నావా? ఏంటి సంగతులు?", బాల్య స్నేహితుడి లాగానే ఆప్యాయంగా బదులిచ్చాడు రమేష్.

" ఆ బాగానే ఉన్నాను, నువ్వు యూనివర్శిటీ లో నుంచి ప్రొఫెసర్ గా రిటైర్ అయ్యిపోయావేమో కదా. బై ది వే.."

" గోపాల్ నీకు మాధవి ఏమి చెప్పనే లేదా. నేను యూనివర్సిటీలో పని చేయడం మానేసి చాలా రోజులయ్యింది "

" అంటే ముందే మానేశావా జాబ్, లేక పోయిందా? ..బై ది వే.."

గోపాల్ కి రమేష్ పని గురించి కానీ ఆయన ఇప్పుడు ఏమి చేస్తున్నాడని తెలుసుకోవాలని ఈ మాత్రం ఆసక్తి లేదు. రమేష్ గోపాల్ ఉద్దేశ్యంలో ఓ సగటు ఫెయిల్యూర్.

రమేష్ కి గోపాల్ గురించి మాధవి దగ్గర విన్నఅందువల్ల మరీ షాక్ కాక పోయినా, ఒక్కింత ఆశ్చర్యం మాత్రం పడ్డాడు.

రమేష్ కు తన గురించి కానీ మీనా గురుంచి కానీ గోపాల్ కు తెలుసుకోవాలని లేదని తెల్సి పోయింది.

" బై ది వే అని అంటున్నావు...ఏమైనా అడగాలనుకుంటున్నావా? గో ఎహెడ్", అన్నాడు రమేష్.

" నా ఐడెంటిటీ థెఫ్ట్ అయ్యింది. నా సోషల్ ఎవరికో తెలిసిపోయినట్లుంది. నీవు ఎవరితోననినా షేర్ చేసావా. చేసి ఉంటావనుకోను. జస్ట్ రూలింగ్ అవుట్ పాస్సిబిలిటీ . నీకు ఇలాంటి సంఘటన జరిగిన స్నేహితులు తారస పడ్డారా. వాళ్ళు ఏమి చేశారో తెలుసా. లూకింగ్ ఫర్ ఎనీ ఇన్ఫో ..నాకు సహాయ పడుతుందని", గోపాల్ వేగంగా మాట్లాడాడు.

రమేష్ ఓ నిమిషం ఏమి మాట్లాడలేకపోయాడు గోపాల్ హలో అని మరో సారి అంటే..బదులివ్వడానికి గొంతు సవరించుకోవాల్సి వచ్చింది.

"ఇదిగో..కొన్ని లింకులు పంపిస్తాను. చూడు. నాకు నీ సోషల్ సెక్యూరిటీ నెంబర్ గుర్తు లేదు. ఇంకా దానిని ఇతరులతో షేర్ చేసుకొనే ప్రసక్తే లేదు. ఐ ఫీల్ సారీ ఫర్ యూ...", బాధగానే అన్నాడు రమేష్.

గోపాల్ రమేష్ పంపిన లింకులు నొక్కడం మొదలెట్టాడు. 'నేనెవరిని? అన్న రమణ మహర్షి వచనాలు, అలానే మరికొంత ..కొందరి పేర్లు కూడా తెలియని వారి వ్యాసాలూ ఉన్నాయి.

" ఇదేంటి నేనెవరినీ అంటూ ఏదో సన్యాసుల రచనలు పంపిస్తున్నావు..నా గురించి నేను తెలుసుకోవాల్సిన అవసరమేముంది ఇప్పుడు ? ఇవి చదివితే నా సోషల్ ఎలా లీక్ అయ్యిందని తెలుస్తుందా", కొంచెం వేట కారంగానే అన్నాడు గోపాల్

గోపాల్ గొంతులో వెటకారం విన్న రమేష్ కు గోపాల్ మీద జాలి కలిగింది.

" నీ ఐడెంటిటీ, నీ సోషల్ సెక్యూరిటీ నంబర్ పెద్ద సమస్యలేమీ కావు. నీకున్న డబ్బు కొంచెం ఖర్చు పెడితే అదే సాల్వ్ అయ్యిపోతుంది. ఇక ఈ వ్యాసాలంటావా, అవి చదివి ఆ మార్గం లో ప్రయాణించిన వాళ్లు తమ చుట్టూ ఉన్న వాళ్లకి జీవితంలో ప్రశాంతత, ఆనందం తెప్పించిన వాళ్ళే. నీకు తప్పకుండ ఉపయోగ పడతాయి. నీవూ నీ చుట్టూ ఉన్నా వారి గుండెల్లో గుర్తుండిపోతావు. గుడ్ లక్ ", రమేష్, గోపాల్ బదులు వినకుండా ఫోన్ పెట్టేసాడు.

పొద్దున్నే హూస్టన్ నుంచి మియామీ కి ఎగ్జిక్యూటివ్ జెట్ లో బయలు దేరాడు . లోపల ఓ లక్సరీ హోటల్ రూంలో ఉన్నట్లే ఉంది.

రమేష్ యూనివసిటీలలో ఉండి రాసిన పేపర్లు, అతను చేసిన రీసెర్చ్ ఆయన ఫీల్డ్ లో ఓ మంచి స్థానం లో నిలబెట్టాయి. రమేష్ రెండు కార్పొరేట్ బోర్డులలో మెంబెర్, తన అనుభవం, డబ్బు లతో సహాయపడదామని ఓ వెంచర్ కాపిటల్ సంస్థ కూడా ఆరంభించాడు.

గోపాల్ చూసినప్పుడు రమేష్ ఆదాయం తక్కువే ఉన్నా, ఇప్పుడు గోపాల్ కంటే చాలా ఎక్కువే సంపాదించాడు. సంఘంలోనూ తన సర్కిల్స్ లోనూ రమేష్ కు మంచి పేరు ఉంది. ఇవేవి తనకు ఉన్న బాంధవ్యాలను కోల్పోమనలేదు. తన ఆలోచన సరళిలోనూ మార్పు తేలేదు

సముద్రం పై నుంచి మళ్ళీ నేల పైకి వస్తున్నట్టుంది. ఆ వస్తున్నది నేపుల్స్ కదూ ఆ పై నుంచే కిటికీలో కనిపిస్తున్న దృశ్యం చూసి అనుకున్నాడు రమేష్. అవును నేపుల్స్ లాగానే ఉంది. పక్క నున్న మారక ద్వీపం. ఇంత ఎత్తు నుంచి ఓ పెసరట్టు లాగ కనిస్పిస్తున్నది. చుట్టూ ఉన్న ఇండ్లు ఉల్లిపాయ ముక్కలుగా , ఇండ్ల ముందున్న లాన్స్ పచ్చి మిరపకాయ ముక్కలు గా కనిపిస్తున్నాయి. ద్వీపం మొత్తం ఆకు అలుములతో పచ్చగానే ఉంది. మియామీ రావడానికి ఇంకో పది నిమిషాలు ఉంది, మెడిటేషన్ చేయొచ్చనిపించింది రమేష్ కు. కళ్ళు మూసుకొని ద్యానంలోకి వెళిపోయాడు. ఈ ప్రపంచం, ఈ సూర్య గ్రహాలూ, పాల పుంత , వీటన్నిటిని తప్పించుకొని, ఆలోచనలు ఏమి లేని ఓ అనిర్వచనీయమైన స్థితికి కొన్ని క్షణాలలోనే చేరుకున్నాడు.

COMMENTS